

మద్యం మాన్పిస్తున్నారు..!

ఆదిలాబాద్‌కు చెందిన 'డవ్' స్వచ్ఛంద సంస్థ డీ అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తోంది. ఇందులో మద్యానికి బానిసైనవారికి కౌన్సెలింగ్ ఇచ్చి తాగుడు మాన్పిస్తోంది.

8లో▸



పంట్ల తోటల పెంపకానికి చేయూత 8లో▸

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఎస్సీ. ఎస్టీ రైతులను ప్రోత్సహిస్తోంది. 13రకాల పండ్ల మొక్కలను రాయితీపై అందిస్తోంది.

గరిష్టం/కనిష్టం
28.0 /24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల ఉరుములు. మెరుపులతో వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గజ్జలమ్మ దేవికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారిని అభిషేకం, అలంకరణ, పల్లకి సేవ నిర్వహించారు. కుంటాలకు చెందిన మొండి గజేందర్ అమ్మవారికి రెండు తులాల వెండి బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ గేట్లు మూసివేత

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు గేట్లు మూసివేసి దిగువకు నీటి విడుదలను నిలిపేశారు. ఆదివారం ప్రాజెక్టుకు 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రస్తుతం 357.70 మీటర్ల నీటిమట్టం ఉంది.

పెట్రోలింగ్ పరిశీలన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ ప్రాంతంలో శనివారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణ సీఐ పురుషోత్తంచారి ఉన్నారు.

అమెరికాలో దశాబ్ది ఉత్సవాలు జరపడం అభినందనీయం



రమణారావును సన్మానిస్తున్న నాయకులు

కుంటాల: అమెరికాలోని డల్లాస్ నగరంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు జరిపి తెలంగాణ ప్రగతిని చాటి చెప్పిన మాజీ ఎంపీపీ అరుణ రమణారావును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఇటీవల అమెరికా నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆదివారం పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. నాయకులు సాంప్లీ రమేశ్, సోలంకి భీంరావుపటేల్, పండిత్‌పటేల్, మధుకర్ కౌటిక్, మాజీ సర్పంచ్ శ్యాంరావ్‌పటేల్ తదితరులున్నారు.

'మణిపూర్ ఘటన పునరావృతం కానీయొద్దు'

నిర్మల్‌టౌన్: మణిపూర్ ఘటన ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కో కన్వీనర్లు సిరికొండ రమేశ్, జింక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్నారు'



పార్టీలో చేరిన యువకులతో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: నిర్మల్‌లోని మంజులాపూర్, లక్ష్మణచాంద మండలం బోరిగాం గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆదివారం బీజేపీలో చేరారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వీరికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను మద్యం, మత్తు పదార్థాలకు బానిసలను చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బ్రాందీషాపులపై ఉన్న శ్రద్ధ బడులపై లేదని మండిపడ్డారు. బీజేపీ అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. నిర్మల్‌లో కబ్జాకోరు పాలన సాగుతోందని, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కబ్జా చేసిన వేల ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు పంచే రోజు వస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారులో కుదుపులు

- ఎన్నికల వేళ మారుతున్న స్వరం
- ముధోల్‌లో అసమ్మతి రాగం
- ఖానాపూర్‌లో స్వపక్షంలో విపక్షం
- నిర్మల్‌లో బలం పెంచుకునే యత్నం



నిర్మల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో రాజకీయాలు రోజురోజుకూ మారుతున్నాయి. ఒకే పార్టీలో ఉన్న వాళ్లు ఇప్పుడు ప్రత్యర్థులుగా మారుతున్నారు. మరో పార్టీలో ఉన్న ప్రత్యర్థులను దగ్గర తీసే ప్రయత్నాలూ చేస్తున్నారు. ప్రధానంగా అధికార బీఆర్ఎస్‌లో సొంతపార్టీ నాయకులు వేరు కుంపటి పెడుతున్నారు. ముధోల్, ఖానాపూర్‌లో కీలక నేతలు భిన్నస్వరం వినిపిస్తున్నారు. ఏకంగా సిట్టింగ్‌లనే మార్చమంటున్నారు. నిర్మల్‌లో కీలక నాయకులే పార్టీ మారారు. మూడు నియోజకవర్గాల్లో పార్టీతో పాటు పలువురు నేతల మాటలూ మారుస్తున్నారు.

భిన్నస్వరం..

స్తబ్దుగా ఉండే ముధోల్ నియోజకవర్గంలో కూడా ఇప్పుడిప్పుడే భిన్నస్వరం వినిపిస్తోంది. స్వపక్షంలోనే విపక్షంలా అధికార బీఆర్ఎస్‌లో కొంతమంది ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపైనే ఫిర్యాదు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్‌ను మార్చాలంటూ పార్టీ సీనియర్లను కలుస్తున్నారు. మరోవైపు ఒకరిద్దరు మాజీ ప్రజాప్రతినిధులు ఇప్పటికే పార్టీని వదిలి కాంగ్రెస్ దిశగా వెళ్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోనూ దాదాపు ఇదే స్వరం వినిపిస్తోంది. ఇక్కడా అధికార బీఆర్ఎస్‌లోనే లొల్లి నడుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్‌కు కాకుండా తాము పేర్కొన్న నేతకు టికెట్ ఇవ్వాలంటున్నారు ఇక్కడి నేతలు. కానీ.. ఇక్కడ జాన్సన్‌నాయక్, పూర్ణచందర్‌నాయక్, జనార్దన్‌రాథోడ్, శర్మన్‌చౌహాన్ ఇలా వర్గాలుగా వీడి పార్టీపై ఒత్తిడి పెంచుతున్నారు.

ఎవరి దారి వారిదే..

ఎన్ని ఫిర్యాదులు చేసినా, ఎంత అసమ్మతి రాగం వినిపించినా లాభం ఉండదనుకునే నేతలు తమ దారి తాము చూసుకుంటున్నారు. ముధోల్, నిర్మల్‌లో ఇప్పటికే పలువురు సీనియర్ నాయకులు, కీలక నేతలు పార్టీలు మారడం మొదలు పెట్టారు. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై వ్యతిరేకతతో సీనియర్ నేత, ఉద్యమకారుడు శ్రీహరిరావు, సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కారు దిగి కాంగ్రెస్‌లో చేరారు. మంత్రితోపాటు గులాబీ పార్టీపై ఆరోపణలు చేస్తూ.. మరింతమందిని తీసుకెళ్లే ప్రయత్నాలూ చేస్తున్నారు. మరోవైపు తమ పార్టీకి తగ్గిన బలాన్ని పెంచుకునేందుకు అన్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తిని ఇటీవలే మంత్రి కారెక్కించుకున్నారు. తాజాగా ముధోల్‌లో రాజీనామాలు, చేరికల పర్వం మొదలైంది. ముధోల్ మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్ దంపతులు, మాజీ ఎంపీపీ సాయిబాబా బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు. ఏ పార్టీలో చేరుతామని వీరు ప్రకటించకున్నా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి రావడంతో కాంగ్రెస్‌లో చేరవచ్చని చెబుతున్నారు.

స్వపక్షంలోనే విపక్షం..

జిల్లాలో ఎస్టీ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో పరిస్థితి రోజురోజుకూ భిన్నంగా మారుతోంది. బీఆర్ఎస్‌లో సొంతనేతలే వేరుకుంపట్లు పెట్టారు. ఈసారి సిట్టింగ్‌ను మార్చడం ఖాయమని, ఇక తామే బరిలో ఉంటామంటూ జాన్సన్‌నాయక్, పూర్ణచందర్‌నాయక్, జనార్దన్‌నాయక్ తదితరులు ప్రచారం చేస్తున్నారు. వీటిని మొదట్లో ఖండించిన స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ ఇటీవల స్పందించడం లేదు. తాజాగా నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టారు. ఈనేపథ్యంలో సీఎం కేసీఆర్‌నూ కలిసివచ్చారు. ఈ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీలోనూ ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీపడుతున్న నేతల జాబితా పెద్దగా ఉండడం, ఎవరికివారు పోటాపోటీగా ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశమవుతోంది.

రవాణా భత్యమేది..?

- జిల్లాలో 786 మంది అర్హులు
- భత్యం రాక నడిచి వెళ్తున్న విద్యార్థులు
- మూడేళ్లుగా ఎదురుచూపులే



ఆటోలో వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

నిర్మల్ రూరల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్కారు బడులు లేని కారణంగా దూరంలోని బడులకు వెళ్తున్న విద్యార్థులకు ఏటా ప్రభుత్వం ప్రయాణ చార్జీలు చెల్లిస్తోంది. అయితే మూడేళ్లుగా ఈ భత్యం రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు అందుబాటులో లేవు. కొన్ని పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో ఉన్న విద్యార్థులను సమీపంలోని పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. దీంతో చాలా మంది పిల్లలు దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్తున్నారు. ఆవాస పరిధిలోని కిలోమీటర్ నుంచి మూడు కిలోమీటర్ల దూరం వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా రవాణా భత్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.6 వేల చొప్పున చెల్లించాల్సి ఉండగా, కరోనా ముందు వరకు రవాణా భత్యం సక్రమంగానే చెల్లించింది. కోవిడ్ తర్వాత చెల్లింపు నిలిచింది.

జిల్లాలో 786 మంది అర్హులు..

జిల్లాలో ఆవాస ప్రాంతాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత బడులు లేని గ్రామాలు 35 ఉన్నాయి. ఇందులో 15 గ్రామాలు ప్రాథమిక పాఠశాలలు గ్రామానికి దూరంగా ఉండగా, 20 ప్రాథమికోన్నత బడులు ఉన్నాయి. ఆవాస ప్రాంతాల్లో సర్కారు బడులు లేక దూర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు 786 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.600 చొప్పున 10 నెలలకు రూ.6 వేలు చెల్లించాల్సి ఉంది.

ప్రైవేట్ వాహనాల్లో..



సోన్ మండలం సాకిర నుంచి ప్రతీరోజు బడికి వెళ్తున్నాను. సమయానికి బస్సులు అందుబాటులో ఉండకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. రెండేళ్లుగా రవాణా భత్యం చెల్లించలేదు. తొందరగా విడుదల చేస్తే బాగుంటుంది.
– చైత్ర, 8వ తరగతి, కడ్తాల్ ఉన్నత పాఠశాల

వెంటనే విడుదల చేయాలి



ప్రతీరోజు జాఫ్రాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి కడ్తాల్ పాఠశాలకు వెళ్తున్నా. మూడేళ్లుగా రవాణా భత్యం చెల్లించడం లేదు. డబ్బులు చెల్లించి బడికి వెళ్లడం భారం అవుతోంది. ప్రభుత్వం వెంటనే రవాణా భత్యం విడుదల చేయాలి.
– లక్ష్మణ్, 10వ తరగతి, కడ్తాల్ ఉన్నత పాఠశాల

ప్రతిపాదనలు పంపించాం



జిల్లాలో 786 మంది విద్యార్థులు వారి గ్రామాల నుంచి సమీప పాఠశాలలకు చదువుకోవడానికి వెళ్తున్నారు. వీరికి సంబంధించిన రవాణా భత్యం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే విద్యార్థుల ఖాతాల్లో భత్యం జమ చేస్తాం.
– రవీందర్‌రెడ్డి, డీఈవో

సగానికిపైగా జీరో..!



- ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్‌లో జాప్యం
- కలెక్టర్ ఆదేశించినా నెమ్మదిగానే..

భైంసాటౌన్: జిల్లాలో 2022–23 ఖరీఫ్ సీజన్ కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు ఆరు శాతం మాత్రమే ప్రక్రియ పూర్తికాగా, సగానికిపైగా రైస్‌మిల్లుల నుంచి ఒక్క బియ్యం బస్తా కూడా ఎఫ్‌సీఐకి పంపనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో సీఎంఆర్ ప్రక్రియలో జాప్యంపై కలెక్టర్ ఇటీవల తహసీల్దార్లతో మిల్లులను తనిఖీ చేయించారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు వందశాతం బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించాలని ఆదేశించారు. రోజుకు 56 ఏసీకేల చొప్పున లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అయినప్పటికీ సీఎంఆర్ ప్రక్రియలో ఎలాంటి వేగం కనిపించడం లేదు. రోజువారీ లక్ష్యం విధించి దాదాపు పక్షంరోజులు దాటినా బియ్యం అప్పగింత అంతంతమాత్రంగానే జరుగుతోంది.

సగానికిపైగా మిల్లుల్లో జీరో శాతమే..

2022–23 ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో 60 రైస్ మిల్లులకు 1,68,177 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించారు. మిల్లర్లు 1,12,678.590 మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంది. ఇందులో 25మిల్లుల నుంచి 6,954.775 మెట్రిక్ టన్నుల బియ్యం (ఈనెల 17వరకు) మాత్రమే ఎఫ్‌సీఐకి అప్పగించారు. ఇదిలా ఉండగా, మొత్తం 60 రైస్‌మిల్లులకు సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయిస్తే, వీటిలో 34 మిల్లుల్లో సీఎంఆర్ ప్రక్రియ జీరో శాతంగా ఉంది. మిగతా వాటిలో ఒక మిల్లులో 38 శాతం, మరో మిల్లులో 26 శాతం, రెండు మిల్లుల్లో 20 శాతం, మరి కొన్నింటిలో 19,17,14,13,11 శాతం సీఎంఆర్ పూర్తి కాగా, మిగతా చోట్ల ఒక అంకె కూడా దాటలేదు.

బియ్యం తిరస్కరణ..!

జిల్లాలో కస్టం మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఎఫ్‌సీఐ గోదాంకు పంపిస్తుంటారు. కాగా, అక్కడి ఎఫ్‌సీఐ అధికారులు జిల్లా నుంచి వెళ్లిన పలు బియ్యం లారీలను నిబంధనల మేరకు నాణ్యత లేని కారణంగా తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల లోకేశ్వరం మండలంలోని ఓ మిల్లుకు చెందిన ఆరు ఏసీకేల బియ్యం వెనక్కి పంపారు. ఎఫ్‌సీఐ అధికారులు బియ్యం అన్‌లోడ్ చేసుకునే క్రమంలో నిబంధనలు కచ్చితంగా పాటిస్తుండడంతో సమస్య ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. నాణ్యతా ప్రమాణాల పేరిట బియ్యం లారీలు ఎఫ్‌సీఐ అధికారులు తిరస్కరిస్తుండడంతో రూ.లక్షల్లో నష్టపోతున్నామని ఓ రైస్‌మిల్లర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గోదాంల కొరత కారణంగా కూడా సీఎంఆర్‌లో జాప్యం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

2022-23 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ ఇలా.. (ఈనెల 17వరకు)

ధాన్యం కేటాయించిన మిల్లులు: 60
సీఎంఆర్‌కు అప్పగించిన ధాన్యం: 1,68,177 మెట్రిక్ టన్నులు
ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన బియ్యం: 1,12,678.590 మెట్రిక్ టన్నులు
అందించిన సీఎంఆర్: 6,954.775 మెట్రిక్ టన్నులు
ఇంకా అప్పగించాల్సింది: 1,05,723.815 మెట్రిక్ టన్నులు

గడువులోగా పూర్తి చేయాలి

2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కొందరు రైస్‌మిల్లర్లు ఇప్పటివరకు సీఎంఆర్ అప్పగించని మాట వాస్తవమే. గోదాముల కొరత కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మా దృష్టికి తెచ్చారు. ఎఫ్‌సీఐ అధికారులతో సమావేశం నిర్వహించి వేరే గోదాంలు కేటాయించాలని విన్నవించాం. గడువులోగా సీఎంఆర్ అప్పగించాలని రైస్‌మిల్లర్లకు సూచించాం.
– తనూజ, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి

'ఎన్నికలప్పుడే పేదలు గుర్తొస్తారా?'



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్ఎస్‌కు ఎన్నికలు వచ్చినప్పుడే పేదలు గుర్తుకొస్తారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు. పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న డిమాండ్‌తో బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పాత కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో తప్పుడు వాగ్దానాలతో అధికారం చేజిక్కించుకున్న బీఆర్ఎస్ ప్రజలను పూర్తిగా విస్మరించిందన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వకుంటే అర్హుల ఖాతాల్లో రూ.5లక్షలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో రాష్ట్రవ్యాప్త ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా విజయవంతం చేస్తామని చెప్పారు. బీజేపీ పేదల పక్షాన పోరాడుతోందని తెలిపారు. పేదలకు న్యాయం జరిగే దాకా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, సీనియర్ నేత డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్, అసెంబ్లీ కన్వీనర్ నాయిడి మురళి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రాజెక్ట్‌ను పట్టించుకోని ప్రభుత్వం'



ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న రాథోడ్ రమేశ్

కడెం: కడెం ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. ఆదివారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఏడాదైనా ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోవడం స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈనెల 29న ఆయకట్టు కాలువలకు నీటిని విడుదల చేయాలని ప్రాజెక్ట్ అధికారులను కోరారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, ఆయకట్టు రైతాంగానికి అండగా ఉంటామని చెప్పారు. కడెం, ఖానాపూర్ బీజేపీ మండలాధ్యక్షులు కిష్టయ్య, టీకు ప్రకాశ్, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, ఆకుల శ్రీనివాస్, సంజీవ్, మల్లేశ్, రమేశ్, బుచ్చన్న తదితరులున్నారు.

పైపులైన్ దెబ్బతిని నిలిచిన భగీరథ నీరు



కడెం: మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం ప్రజలను ఇబ్బందులపాలుజేస్తోంది. ఇటీవలే కడెం ప్రాజెక్ట్ నుంచి భారీ వరదలతో పాండ్వపూర్ సమీపంలోని వంతెన పక్కనగల మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతింది. దీంతో సుమారు యాభైకి పైగా గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. గతేదాది వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్న పైపులైన్‌కు నామమాత్రపు మరమ్మతులు చేయడంతోనే మళ్లీ దెబ్బతిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.


తెగిన జిల్లేడికుంట రోడ్డు



తెగిన రోడ్డును చూస్తున్న ఆదివాసీలు

ఖానాపూర్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధి జిల్లేడికుంట రోడ్డు శనివారం రాత్రి కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచాయి. వెంటనే తెగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సదర్మాట్‌కు కొనసాగుతున్న వరద



ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్టకు భారీ వరద కొనసాగుతోంది. కొద్దిరోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆనకట్ట వద్దకు వచ్చిన నీరంతా గోదావరిలోకి వెళ్తోంది. సదర్మాట్ గరిష్ట నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 8.4 ఫీట్ల నీటి మట్టం ఉంది. దీంతో 7,168 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నట్లు ఏఈఈ ఉదయ్ తెలిపారు.

'కడెం'కు తగ్గిన వరద

కడెం: మూడ్రోజులుగా అతలాకుతలమైన కడెం ప్రాజెక్ట్‌కు వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం రాత్రి 9,058 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో.. ఒక వరద గేటు ద్వారా 894 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 (7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 688.325(4.927టీఎంసీ) అడుగుల నీటిమట్టం ఉంది.



కడెం ప్రాజెక్ట్



'కడెం' రోడ్డుపై గుంతలు

కడెం ప్రాజెక్ట్‌పై ఉన్న రోడ్డు కంకర తేలి, గుంతల్లో నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. ఐదురోజులుగా కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ పూర్తిగా నిండగా సందర్శకుల తాకిడి కూడా పెరిగింది. నీళ్లు నిలిచిన గుంతల రోడ్డుపై నడిచేందుకు సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

చికెన్ రూ.120.. టమాట రూ.160



చికెన్ కోసం ఎగబడుతున్న జనం

బోథ్: మండలంలో చికెన్ ధర పడిపోయింది. ఆదివారం వ్యాపారులు కిలో చికెన్ ధర రూ.120కే విక్రయించారు. దీంతో ప్రజలు చికెన్‌ను ఎగబడి కొన్నారు. ఆదివారం కావడంతో వ్యాపారులు పోటీపడి ధర తగ్గించారు. చికెన్ ధరతో పోల్చితే కిలో టమాట రూ.160లు ఉండగా ప్రజలు చికెన్ ఎక్కువగా కొన్నారు.

జాతీయస్థాయి వుషూ జడ్జీల ఎంపిక





సర్టిఫికెట్ అందుకుంటున్న సతీశ్, సాయికృష్ణ

బెల్లంపల్లి/భైంసాటౌన్: జాతీయస్థాయి వుషూ జడ్జీలుగా నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన శ్రీరాముల సాయికృష్ణ, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన వేముల సతీశ్ ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 23 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని సరళ బిర్లా యూనివర్సిటీ ప్రాంగణంలో వుషూ జడ్జీ, కోచ్‌ల శిక్షణ తరగతులు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 31 రాష్ట్రాల నుంచి దాదాపు 400 మంది కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు. ఆదివారం శిక్షణ తరగతులు ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న సాయికృష్ణ, సతీశ్‌లకు వుషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ జితేందర్ సింగ్ పజ్వా, సెక్రెటరీ విజయ్ శరాఫ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

నవోదయలో రాష్ట్ర క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని నవోదయ విద్యాలయంలో ఈనెల 27, 28వ తేదీల్లో రాష్ట్ర క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, వాలీబాల్ అండర్–14, 17, 19 విభాగాల బాలుర, బాలికలు, 'సుబ్రతా కప్' ఫుట్‌బాల్ అండర్–14, 17 బాలురులు, బాలికలు 17 బాలికల ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

ఒకరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కుంటాల: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం కుంటాల–అంబకంటి మార్గంలో ఎస్సై వాహనాలు తనిఖీ చేశారు. బ్రీత్‌ఎనలైజర్ ద్వారా పరీక్ష చేయగా ఒకరు మద్యం తాగినట్లు తేలింది. అతనిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో యువకుడు గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన ముత్తన్న (30)కు భార్య సరస్వతి, ఆరేళ్ల కుమారుడు కుమారుడు ఉన్నారు. ముత్తన్న ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం రాత్రి ఇంటికి వచ్చాక భోజనం చేశాడు. ఛాతీనొప్పి ఉందని భార్యకు చెప్పాడు.వెంటనే జండూబామ్ ఇవ్వడంతో రాసుకున్నాడు. ఆపై నిద్రకు ఉపక్రమించాడు. ఆదివారం ఉదయం లేవకపోవడంతో వెళ్లి చూడగా నిద్రలోనే గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మద్యం మాన్పిస్తున్నారు..!



కౌన్సెలింగ్ ఇస్తున్న నిర్వాహకులు

జీవితం మారింది..

ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు తాగుతూ ఎక్కడపడితే అక్కడ రోడ్లపై పడిపోయేవాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆ వ్యక్తిని ఇంటికి తీసుకెళ్లేవారు. కుటుంబీకులు సైతం విసుగుచెంది మద్యానికి బానిసైన వ్యక్తిని డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించారు. నెల రోజులపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో ఆయన పూర్తిగా మారిపోయాడు. మద్యం మానేశాడు. ఆ తర్వాత కష్టపడి పని చేసుకుంటూ ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాడు. సొంత ఇంటిని నిర్మించుకున్నాడు. కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవిస్తున్నాడు.

- ఆదిలాబాద్‌లో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రభుత్వ జిల్లా ఆస్పత్రుల్లో డీ అడిక్షన్ సెంటర్లు



పరీక్షిస్తున్న వైద్యుడు

సాక్షి, మంచిర్యాల డెస్క్: మద్యపానం అలవాటు వ్యసనంగా మారి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. కొందరు మద్యానికి బానిసగా మారి ఒళ్లు.. ఇల్లు గుల్ల చేసుకుంటూ ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మద్యానికి బానిసగా మారిన ఓ బాలుడు ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. మద్యానికి బానిసగా మాన్పించేందుకు జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఏర్పాటు చేసింది. మంచిర్యాలలో మెంటల్ హెల్త్ క్లినిక్‌గా నిర్వహిస్తూ మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు ఇతర ఏ అలవాట్లు ఉన్నా చికిత్స అందిస్తున్నారు. సైకియాట్రిస్టు రెండు నెలలుగా ఓపీ చూస్తున్నారు. ఆదిలాబాద్‌లో డవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తూ వందలాది మందిని మద్యం మాన్పించారు. మద్యానికి బానిసగా మారిన వారు ఆయా కేంద్రాల్లో కౌన్సెలింగ్ ద్వారా మారవచ్చు.

ఆదిలాబాద్‌లో 'స్వచ్ఛంద'ంగా..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డవ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. 2005లో ప్రారంభించిన ఈ సెంటర్‌లో ఇప్పటివరకు 1200 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతీ నెల 15మంది చొప్పున ఈ కేంద్రంలో చేర్చుకుని కౌన్సెలింగ్, చికిత్స అందిస్తారు. 2022 సంవత్సరంలో 180మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ సెంటర్‌లో కౌన్సెలింగ్‌తోపాటు మందులు, యోగా, ఫ్యామిలీ, వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇస్తారు. ఉల్లాసం కోసం సాయంత్రం వేళల్లో ఆటలు ఆడిస్తుంటారు. కొందరిని బృందాలుగా ఏర్పాటు చేసి చర్చలు చేయిస్తారు. సైకియాట్రిస్టుతో వారానికి రెండు నుంచి మూడు రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రోజుకు మూడు పూటల భోజనం ఉచితంగా అందిస్తారు. ప్రతీ రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, వారానికోసారి గుడ్డు కూరతో భోజనం పెడతారు. ఈ కేంద్రంలోనే కాకుండా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామాలకు వెళ్లి మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మద్యానికి, మత్తు పదార్థాలకు ఎవరైనా అలవాటు పడి వ్యసనంగా మారిన వారిని గుర్తించి ఈ సెంటర్‌లో చేర్చుకుంటారు. సర్పంచ్, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం, పోలీసుల ద్వారా వివరాలు సేకరిస్తారు.



బానిసగా మారి బాలుడి ఆత్మహత్య

- మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని సత్యసాయినగర్ కాలనీకి చెందిన శివసాయి(16) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. కుటుంబ సభ్యులు మందలించడంతో జూన్ 27న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం కృష్ణపెల్లి గ్రామానికి చెందిన జయరాం(48) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. జూన్ 29న ఇంట్లోనే ఉరేసుకున్నాడు.
- నిర్మల్ జిల్లా తానూరు మండల కేంద్రానికి చెందిన కారగిరి ఎల్లప్ప(40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జూలై 2న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- నిర్మల్ జిల్లా భైంసా మండలం గుండెగాం గ్రామానికి చెందిన బాలాజీ(28) కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసగా మారి భార్యాపిల్లలతో గొడవపడేవాడు. జూలై 6న గడ్డెన్నవాగుప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఆదిలాబాద్ జిల్లా మావల పోలీసుస్టేషన్ పరిధిలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన చిలుక రవీందర్(31) మద్యానికి బానిసగా మారి ఈ నెల 20న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తానిమడుగు గ్రామానికి చెందిన మోతె లింగయ్య(34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య పుట్టింటికి వెళ్లిపోయినా మద్యం మానలేదు. ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

కౌన్సెలింగ్, భోజన వసతి..

మద్యం, మత్తు పదార్థాలకు బానిసైన వారికి డవ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. నెలకు 15 మంది చొప్పున సెంటర్‌లో చేర్చుకోవడం జరుగుతుంది. దాదాపు 30 శాతం మంది మారుతున్నారు. ఈ సెంటర్‌లో చేరిన వారికి కౌన్సెలింగ్‌తోపాటు భోజనం అందిస్తాం. గ్రామాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరైన మద్యానికి బానిసైతే డవ్ సెంటర్‌లో సంప్రదించవచ్చు.

– చంద్రశేఖర్‌రెడ్డి, డవ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

అన్ని అవయవాలపై ప్రభావం



మద్యపానం, మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా శరీరంలోని వెంట్రుకల నుంచి గోళ్ల వరకు అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. మద్యం అలవాటు ఉన్నవారిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలి. మొదటి డి టాక్సికేషన్ ట్రీట్‌మెంట్ అందించడం జరుగుతుంది. ఆ తర్వాత డీ అడిక్షన్ చేస్తాం. వ్యక్తి ప్రశాంతంగా ఉండే విధంగా వైద్యం అందిస్తాం. అగొనెస్ట్ థెరపీ చేయడం జరుగుతుంది. పది రోజుల్లో సాధారణ స్థితికి వస్తారు. మద్యం జోలికి పోకుండా, మద్యమంటే ఇష్టపడకుండా ట్యాబ్లెట్లు ఇవ్వడం జరుగుతుంది. మద్యం సేవిస్తే రియాక్షన్ అయి వాంతులు, తలనొప్పి వంటివి జరిగి మద్యం జోలికి వెళ్లకుండా ఉంటారు. నెల రోజులపాటు వైద్యం అందిస్తాం. చాలామందిలో మార్పు వచ్చింది.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్, రిమ్స్

పాలనురగులా 'కొర్టికల్'




నేరడిగొండ: కొర్టికల్ జలపాతం పాలనురగు వంటి జలధారాలతో ప్రవహిస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో కుంటాల జలపాతం వద్ద వెళ్లడానికి అనుమతి లేదు. దీంతో జాతీయ రహదారి పక్కనే ఉన్న కొర్టికల్ జలపాతం వద్ద పర్యాటకులు సేదతీరారు. పలువురు సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు.


'చింతల మాదర'కు జలకళ



తిర్యాణి: మండలంలోని చింతల మాదరకు జలకళ సంతరించుకుంది. దీంతో సందర్శకులను కనువిందు చేస్తోంది. దీంతోపాటు క్రమంగా పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు జలపాతానికి వీక్షించేందుకు తరలివచ్చారు.

కొండెంగలొద్ది, దొద్దులాయిలకు పోటెత్తిన వరద





పెంచికల్‌పేట్: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండెంగ లొద్ది, దొద్దులాయి జలపాతాలకు వరద పోటెత్తడంతో సుమారు 80 అడుగుల ఎత్తు నుంచి నీరు జాలువారుతోంది. దీంతో ఆయా జలపాతాలు జలకళ సంతరించుకున్నాయి.

తాడు సాయంతో వాగు దాటుతూ..



ఇంద్రవెల్లి: కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి వరద ప్రవహిస్తోంది. మండలంలోని చిత్తబట్ట, మామిడిగూడ గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జిలు లేకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలోని గౌరపూర్ సర్పంచ్ కోవ ఫాతిమా ఆదివారం చిత్తబట్ట వాగు వద్ద తాడు కట్టించారు. గ్రామస్తులు తాడు సాయంతో రాకపోకలు సాగించారు. కొందరు వ్యవసాయ పనులకు, మరికొందరు ఇళ్లలో సరుకులు తీసుకుస్తున్నారు. మామిడిగూడలో వరదనీరు కొంత తగ్గడంతో ఆదివాసీలు ఒకరికొకరు సాయంతో వాగు దాటి రాకపోకలు సాగిస్తున్నారు.

పండ్ల తోటల పెంపకానికి చేయూత

- ఉపాధి హామీ ద్వారా సాగుకు ప్రభుత్వ నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ చిన్న,సన్నకారు రైతులకు ప్రోత్సాహం
- రాయితీపై పండ్ల మొక్కలు
- ఈనెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ



తాంసి మండలం సావర్గాం శివారులో సాగవుతున్న జామ తోట

కైలాస్‌నగర్/నిర్మల్‌చైన్‌గేట్: ఎస్సీ, ఎస్టీలకు చెందిన చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం చేయూత అందిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో వీటి సాగు చేపట్టేందుకు నిర్ణయించింది. రాయితీపై పండ్ల మొక్కలు అందించనుంది. ఈ ఏడాది బిందుసేద్యం ద్వారా 13 రకాల పండ్లు, అంతరపంటల సాగుకు అవకాశం కల్పిస్తుంది. ఆదిలాబాద్ జిల్లాలో 1,005 ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 1100 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకమే లక్ష్యంగా డీఆర్డీవో, ఉద్యానవనశాఖ నిర్ణయించింది. ఈనెలాఖరు వరకు అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

నాలుగేళ్ల వరకు ప్రభుత్వానిదే బాధ్యత

ఉపాధి నిధులతో చేపట్టే పండ్ల తోటల సంరక్షణ బాధ్యతలను నాలుగేళ్ల వరకు ప్రభుత్వానిదే బాధ్యత ఉంటుంది. మామిడి మొక్కలు రూ. 30, నిమ్మ రూ. 25, నారింజ రూ. 44, జీడీ మామిడి రూ.24, జామ రూ.31, సీతాఫలం రూ.26, సపోట రూ.37, ఆయిల్ పాం రూ.20, నేరేడు రూ.25, ఆపిల్ బేర్ రూ.51, దానిమ్మ రూ.24, మునగ రూ.15, డ్రాగన్ ఫ్రూట్స్ రూ.40, కొబ్బరి రూ.36 చొప్పున కొనుగోలుకు చెల్లించనుంది. గుంతలు తవ్వించడం, పండ్ల మొక్కలు నాటించడం తదితర పనులను ఉపాధి కూలీల ద్వారా చేపడుతారు. మొక్కలు నాటి ఊతం ఇచ్చినందుకు, ఎరువులు వేసేందుకుగాను ప్రతి మొక్కకు రూ.50, నిర్వహణ కింద రూ.10 చొప్పున రాయితీని అందించనుంది. మొక్కలు నాటిన ఏడాది నుంచి నాలుగేళ్ల పాటు నిర్వహణకు రాయితీలు, ప్రోత్సాహకాలను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయనుంది.

అంతర పంటలు సైతం..

పండ్ల మొక్కలతోపాటు అంతర పంటలు సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. బీరకాయ, సోరకాయ, కాకరకాయ, చిక్కుడు, టమాట, పచ్చిమిర్చి, బోడ కాకర, గోరు చిక్కుడు, దోస, మునగ సాగుకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. వివిధ రకాల పూల సాగుకు రైతులు ముందుకొస్తే రాయితీలు పొందవచ్చు.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

పండ్ల తోటల పెంపకానికి ఈ ఏడాది బిందుసేద్యం పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. ఉపాధి జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు వందశాతం రాయితీ, మిగతా రైతులకు 90 శాతం రాయితీపై అందిస్తోంది. ఈ పండ్ల మొక్కలతో పాటు ఇతర మొక్కలను ఏమైనా సాగు చేసుకోవచ్చు. ప్రభుత్వం కల్పించిన రాయితీ ధరకు మించి ఉంటే మిగతా డబ్బులను సంబంధిత రైతులు చెల్లించి తీసుకునే అవకాశం కల్పించింది.

ఈనెల 31వరకు దరఖాస్తు గడువు

పండ్ల తోటల సాగుకు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి, అనువైన భూమి, నీటి సౌకర్యం కలిగి ఉండాలి. ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులు అర్హులు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత జీపీల కార్యదర్శి, ఎఫ్ఏ, టీఏ, ఈసీ, ఏపీవో, ఏఈవో, ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ అధికారి, ఏవో, సహాయ వ్యవసాయ సంచాలకుడు, ఎంపీడీవో, ఎంపీవోలను సంప్రదించి ఈ నెల 31లోగా దరఖాస్తులకు గడువు విధించారు.

రాయితీలు అందిస్తోంది



పండ్ల తోటల పెంపకాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీలను కల్పిస్తోంది. ఉపాధి హామీ నిధుల ద్వారా 13 రకాల పండ్ల మొక్కలతో పాటు కొబ్బరి తోటనుసైతం నాటుకోవచ్చు. బిందు సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

సద్వినియోగం చేసుకోవాలి



పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం చేయూతనిస్తోంది. చిన్నకారు, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 31 వరకు దరఖాస్తు గడవు ఉంది. ఎందరు రైతులు ముందుకొచ్చినా పండ్ల మొక్కలు అందిస్తాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

అదనపు ఆదాయం



చిన్న, సన్నకారు రైతుల పండ్ల మొక్కలు పెంచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఫలితంగా అదనపు ఆదాయ వనరుగా ఉపయోగపడుతుంది. ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఓన ప్రసాద్, ఏపీడీ

'గిరిజనేతరులకు వత్తాసు పలకడం సరికాదు'



మాట్లాడుతున్న రామారావు

ఉట్నూర్‌రూరల్: రాజకీయ లబ్ధి కోసం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య గిరిజనేతరులకు వత్తాసు పలకడం సరికాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు పేర్కొన్నారు. ప్రెస్‌భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనేతరులకు హక్కులు కల్పించాలని, భూ పట్టాలు ఇవ్వాలని శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో మాజీఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నాయకులు సంతోశ్, భీంరావు, రాజు, జగన్నాథ్‌రావు, యాదవరావు, సీతారాం పాల్గొన్నారు.


జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

- అవస్థలు పడిన ప్రయాణికులు



టోల్‌ప్లాజా వద్ద పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

జైనథ్: పెన్‌గంగలో శనివారం రాత్రి వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. మండలంలోని డొల్లార వద్ద గల బ్రిడ్జిని తాకుతూ ప్రవాహం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బ్రిడ్జి మీదుగా రాకపోకలను నిలిపివేశారు. బ్రిడ్జికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్దనే వాహనాలను ఆపేసారు. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్రిడ్జికి ఇరు వైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం ప్రవాహ ఉధృతి తగ్గడంతో రాకపోకలను అనుమతించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



రహదారి వెంబడి నిలిచిన వాహనాలు